నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 19 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఈఎస్ఐ దవాఖాన ఎదుట నినాదాలు చేస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు

# మెరుగైన వైద్యమందించాలని 'ఈఎస్ఐ' ఎదుట ఆందోళన

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 18 : కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్ఐ దవాఖానలో మెరుగైన వైద్యమందించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. దవాఖానలో సూపరింటెండెంట్ జగన్ అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో సంప్రదించారు. అనంతరం కార్మిక సంఘాల నాయకులు అంబాల ఓదెలు, కలికోట రమణయ్య, షబ్బీర్ హుస్సేన్, గోలం వెంకటేశ్ విలేకరులతో మాట్లాడారు. ఈఎస్ఐ దవాఖానలో మెరుగైన వైద్య సేవలు అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కళకళాలాడిన ఈఎస్ఐ దవాఖాన ప్రస్తుతం ఆలనా పాలనా లేక వెలవెలబోతుందన్నారు. ఈఎస్ఐ దవాఖానను ఇక్కడి నుంచి తరలించడానికి ప్రభుత్వం కుట్రపన్నుతున్నదని, అలా చేస్తే కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ జగన్ సైతం దూరప్రాంతం నుంచి రాకపోకలు సాగిస్తున్నాడని ఆరోపించారు. దవాఖాన తరలించకుండా నివేదికలు పంపాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు సైతం సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించి నూతన భవనాలు నిర్మించాలని, లేదంటే కార్మికుల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు అన్నం రాజన్న, శ్రీనివాస్, వెంకటేశ్, రాజేశ్ పాల్గొన్నారు.

పేహెచ్‌సీలో వివరాలు సేకరిస్తున్న సెంట్రల్ బృందం సభ్యులు

# మంచిర్యాలలో సెంట్రల్ పీఆర్సీ రీసెర్చ్ బృందం పర్యటన

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 18 : విశాఖపట్టణానికి చెందిన సెంట్రల్ పీఆర్సీ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ బృందం మంగళవారం మంచిర్యాల జిల్లాలో పర్యటించింది. జిల్లా ప్రధాన హాస్పిటల్‌తో పాటు మాతా శిశు సంరక్షణ కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉపకేంద్రాలు, ఆయుష్మాన్‌భవ ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖానలను సందర్శించారు. బృందం సభ్యులు డాక్టర్ రమణ, రీసెర్చ్ ఇన్వెస్టిగేషన్ డాక్టర్ శ్రీనివాస్ నాలుగు రోజులపాటు జిల్లాలో సందర్శించి వైద్య సేవలపై ఆరా తీయనున్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ హరిచంద్రారెడ్డి, ఆర్ఎంవోలు భీష్మా, కోటేశ్వరరావు, శ్రీధర్, ఉపవైద్యాధికారి అనిత, ప్రోగ్రాం అధికారులు కృపాబాయ్, అనిల్, సుధాకర్‌నాయక్ లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం హయాలీవాడలోని బస్తీ దవాఖాన, మందమర్రిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి అక్కడ అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డీపీఎం ప్రశాంతి, డీఎంహెచ్‌వో సూపరింటెండెంట్ విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# బర్డ్‌ఫ్లూపై అప్రమత్తం

**మహారాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు**

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : కలకలం రేపుతున్న బర్డ్‌ఫ్లూ నివారణ చర్యల్లో భాగంగా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా సరిహద్దు ప్రాంతమైన వాంకిడితో పాటు సిర్పూర్-టీ మండలంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నది. ఇక జిల్లా కేంద్రంలోని మాంసం మార్కెట్ సమీపంలో వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోంది. సిబ్బంది స్పందించి కూరగాయల మార్కెట్ పక్కనే పడేస్తున్న మాంసం వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వాంకిడి బార్డర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

# పన్నుల వసూళ్లే లక్ష్యంగా..

- మంచిర్యాల కార్పొరేషన్‌లో ప్రత్యేక దృష్టి
- మొండిబకాయి దారులకు రెడ్ నోటీసులు
- విలీన మున్సిపల్, గ్రామాల్లో వసూళ్లపై స్పష్టత కరువు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 17 : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో 100 శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గడిచిన రెండు నెలలు పలు సర్వేల్లో పాల్గొన్న సిబ్బంది, ప్రస్తుతం మార్చి నెలాఖరులోగా సాధ్యమైనంత ట్యాక్స్ వసూలు చేయాలన్న టార్గెట్‌తో ముందుకెళ్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా అధికారులు, సిబ్బందిని నియమించారు. ప్రతి రోజూ ఉదయం ఎనిమిది గంటలకే కాలనీల్లోకి వెళ్లి పన్నులు చెల్లించాలని భవనాల యజమానులను కోరుతున్నారు. కార్పొరేషన్‌లో విలీనమైన నస్పూరు మున్సిపాలిటీతో పాటు హాజీపూర్ మండలంలోని ఎనిమిది గ్రామపంచాయతీల విలీన ప్రక్రియ పూర్తయినప్పటికీ అందుకు సంబంధించిన వివరాలు కార్పొరేషన్ సైట్‌లో కనిపించడంలేదు. దీంతో వసూలు చేయాల్సిన లక్ష్యంపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఇప్పటికైతే మంచిర్యాల మున్సిపాలిటీలోని 36 వార్డుల్లోనే పన్నులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికే 40మందికి పైగా మొండి బకాయిదారులకు రెడ్‌నోటీసులు అందించారు. నిత్యం ఇంటింటికీ చెత్తను సేకరించే వాహనాలకు అమర్చి ఉన్న మైకుల్లో ఆస్తిపన్ను చెల్లించాలంటూ ప్రచారం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఆస్తిపన్ను చెల్లించాలంటూ బ్యానర్లు ఏర్పాటుచేశారు. విలీన మున్సిపల్, గ్రామపంచాయతీలకు సంబంధించిన సిబ్బందిని కూడా వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో కలిపి వసూళ్లకు పంపుతున్నారు.

మంచిర్యాలలో ఆస్తిపన్ను వసూలు చేస్తున్న అధికారులు, సిబ్బంది

**కార్పొరేషన్ పరిధిలో 45327 భవనాలు**

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 45327 భవనాలు ఉన్నాయి. వీటిలో 41479 నివాస భవనాలు, 1977 కమర్షియల్ భవనాలు, 1871 మిక్స్‌డ్ ఉపయోగిత భవనాలు ఉన్నాయి. వీటిమీద ఈ ఏడాదిరూ. 16.47 కోట్ల ఆస్తిపన్ను రావాల్సి ఉంది. ప్రస్తుత పన్నుపై జరిమానా రూ. 86.44లక్షలు, పాతబకాయిలు రూ. 5.52 కోట్లు, పాతబకాయిలపై జరిమానా రూ.3.16లక్షలు కలుపుకుని మొత్తం రూ. 26.02 కోట్లు వసూలు చేయడం లక్ష్యంగా ఉంది. ఇందులో నుంచి ఇప్పటివరకు రూ. 10.03కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ. 15.99 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 38.55 శాతం ఆస్తిపన్ను మాత్రమే వసూలు చేసిన అధికారులు మార్చి నెలాఖరులోగా మిగిలిన మొత్తాన్ని వసూలు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

# అగ్గువకే బంగారమంటూ బురిడీ

## జేసీబీతో తవ్వుతుంటే దొరికింది.. తక్కువకే ఇస్తామంటూ కుచ్చుటోపి

- కౌజుపిట్టల విక్రయాల పేరిట పరిచయం పెంచుకొని మోసం
- నమ్మబలికి నకిలీ గోల్డ్ అంటగడుతున్న కేటుగాళ్లు
- ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు తీసుకెళ్లి డబ్బులు గుంజుకుంటున్న ముఠా
- బెల్లంపల్లి, నెన్నెల మండలాల్లో పలువురు బాధితులు
- ఎవరికి చెప్పకోవాలో తెలియక సతమతమవుతున్నవైనం

*బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఓ లారీ యాజమానికి సైతం ఓ వ్యక్తి ఆరు నెలల క్రితం ఇలాగే పిట్టలు విక్రయించాడు. నంబర్ తీసుకొని నెల రోజుల తర్వాత బంగారం దొరికిందంటూ వాట్సాప్‌లో ఫొటోలు, వీడియోలు పంపించాడు. దానికి సదరు లారీ యాజమాని ఇలాంటివి నాకు అవసరం లేదు. మరోసారి ఫోన్ చేయకండి అని చెప్పి పెట్టేశాడు. అయినా తరచూ వెంట పడుతుండటంతో ఓ స్నేహితుడిని తీసుకొని ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపూర్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి బంగారం బిల్లలను తెచ్చి బెల్లంపల్లిలో తెలిసిన నగల దుకాణంలో టెస్ట్ చేపించాడు. ఒరిజినల్ అని చెప్పడంతో తన స్నేహితులతో కలిసి రూ.40 లక్షల వరకు పట్టుకొని ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపూర్‌కు వెళ్లాడు. అక్కడ డబ్బులు ఇచ్చి బంగారం తెచ్చుకున్నారు. తీరా బెల్లంపల్లికి వచ్చాక వాటిని టెస్ట్ చేపిస్తే అది నకిలీ బంగారం అని తేలింది. ఈ విషయం పోలీసులకు చెబితే ఎంక్వైరీలు, కేసులు అని భయపడి విషయం బయటికి చెప్పలేదు.*

*నెన్నెల మండల కేంద్రానికి చెందిన ఓ చిన్న హోటల్ నిర్వాహకుడు రవీందర్ (పేరు మార్చాం) దగ్గరికి రెండేళ్ల క్రితం ఓ వ్యక్తి వచ్చి కౌజు పిట్టలు విక్రయించాడు. మీకు మళ్లీ పిట్టలు కావాలంటే ఫోన్ చేయండని నంబర్ ఇచ్చి వెళ్లాడు. ఓసారి రవీందర్ పిట్టలు కావాలని సదరు వ్యక్తికి ఫోన్ చేస్తే తెచ్చి ఇచ్చాడు. ఇలా నాలుగైదు సార్లు మాట్లాడాక.. ఓ రోజు ఫోన్ చేసి 'మా తమ్ముడు బెంగళూరులో జేసీబీ నడుపుతాడు. రోడ్డు పనులు చేస్తుంటే బంగారం దొరికింది. అది ఎక్కడ అమ్మాలో తెలియడం లేదు. మీకు కావాలంటే తీసుకోండి. అగ్గువ ధరకే ఇస్తాం' అని చెప్పాడు. 'మీకు అనుమానముంటే వచ్చి బంగారం తీసుకెళ్లి చెక్ చేసుకోండి' అని చెప్పాడు. ఇలా రవీందర్‌ను ఓ రోజు ఆంధ్రప్రదేశ్‌లోని కదిరికి తీసుకెళ్లాడు. అక్కడ బంగారు నాణేల దండలు చూపించాడు. అందులో నుంచి ఓ చిన్న బిల్ల తీసుకొని పరీక్షించుకోమని చెప్పాడు. ఇంటికి వచ్చి చెక్ చేసుకున్న రవీందర్.. అది ఒరిజినల్ బంగారం అని తెలుసుకున్నాడు. రూ. 10 లక్షలు పట్టుకొని బంగారం తీసుకునేందుకు తిరిగి కదిరి వెళ్లాడు. అక్కడికి వెళ్లాక రవీందర్‌ను కత్తులతో బెదిరించి డబ్బు లు లాగేసుకొని, ఎవరికైనా చెబితే చంపేస్తామంటూ బెదిరించి పంపించేశారు. ఇక ఈ విషయం బయటికి తెలిస్తే తన పరువు పోతుందని భావించిన రవీందర్ మిన్నకుండిపోయాడు.*

*మంచిర్యాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి/నెన్నెల, ఫిబ్రవరి15 :*

.. ఇలా వీరిద్దరే కాదు.. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యాపారులు, సాధారణ జనాల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని, దొరికిన బంగారం తక్కువ ధరకే ఇస్తామంటూ ఓ ముఠా మోసాలకు పాల్పడుతున్నది. బెల్లంపల్లి ప్రాంతం నుంచి ఐదారు బ్యాచ్‌లు, నెన్నెల మండలం నుంచి తొమ్మిది బ్యాచ్‌లు.. ఒక్కో బ్యాచ్‌లో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది ఈ కేటుగాళ్ల చేతుల్లో పడి మోసపోయినట్లు తెలుస్తున్నది. బెల్లంపల్లిలో ప్రముఖ వ్యాపారులు, నెన్నెల మండల కేంద్రానికి చెందిన పేరున్న వ్యక్తులు సైతం బాధితుల్లో ఉండటం గమనార్హం. ఇలా మంచిర్యాల జిల్లాల్లో ఇప్పటి వరకు ఈ కేటుగాళ్ల చేతుల్లో పడి మోసపోయిన వారు ఎందరో ఉన్నారు. విషయం బయటికి తెలిస్తే పరువు పోతుందని కొందరు.. పోలీసులకు చెబితే కేసులు, ఎంక్వైరీలు.. ఇవన్నీ అవసరమా.. అని మరి కొందరు ఏం చేయాలో తెలియక సతమతమైపోతున్నారు.

**ఇలా మోసం చేస్తారు...**

ముందు మారువేషంలో గ్రామాల్లోకి వచ్చే కేటుగాళ్లు కౌజు పిట్టలు, అడవి కుందేళ్లు, పూరేడు పిట్టలను వేటాడి అమ్ముకునేవారిగా నటిస్తారు. తమ దగ్గర పిట్టలు కొనుగోలు చేసిన వారి నుంచి అవసరముంటే ఫోన్ చేయండంటూ నంబర్ తీసుకుంటారు. ఒక్కసారి మన నంబర్ వారి చేతికి పోయిందా ఒకటికి రెండుసార్లు ఫోన్‌లు చేసి పిట్టలు ఉన్నాయి.. తీసుకురమ్మంటారా.. అంటూ పరిచయం పెంచుకుంటారు. ఇలా పలుసార్లు ఫోన్ మాట్లాడాక.. ఏదో ఓ రోజు ఫోన్ చేసి 'సార్ మా తమ్ముడు జేసీబీ నడుపుతుంటే బంగారం దొరికింది. మీకు కావాలంటే చెప్పండి.. అగ్గువ ధరకే ఇప్పిస్తా.. మాకు ఎక్కడ అమ్మాలో తెలియడం లేదు. అందుకని మీకు చెబుతున్నాం.. అంటూ నమ్మబలుకుతారు. నమ్మకం లేకుంటే మా దగ్గర ఉన్న బంగారం నుంచి కొద్దిగా తీసుకెళ్లి చెక్ చేసుకోండంటూ వీడియో కాల్ చేసి తమదగ్గరున్న బంగారు ముద్దలు, చిన్నిచిన్న బంగారు బిల్లలను చూపిస్తారు. ఇలా రాయ్‌చూర్, మైసూర్, ఏపీలోని పరిగి, హిందూపూర్, కదిరి ప్రాంతాలు ఒక్కొక్కరికీకీ ఒక్కో ఊరు పేరు చెబుతారు. వీడియో కాల్‌లో బంగారాన్ని చూసి ఆశపడి.. వారు రమ్మన్న చోటుకు వెళ్తే ముందు ఒరిజినల్ బంగారు ముద్దలు, బిల్లలను చూపిస్తారు. అలా చూసిన దాని నుంచి ఏదైనా చిన్న బిల్ల ఒకటి తీసుకెళ్లి చెక్ చేసుకొని రమ్మంటారు. వాటిని చెక్ చేస్తే ఒరిజినల్ అని తేలాక.. డబ్బులు పట్టుకొని బంగారం కోసం వెళ్తే నకిలీ బంగారాన్ని అంటగడుతారు. లేదా మెడ మీద కత్తిపెట్టి తీసుకెళ్లిన డబ్బులను లాక్కుంటారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామంటూ బెదిరిస్తారు. ఓ వ్యక్తి వారు చెప్పిన ప్రాంతానికి వెళ్లి వచ్చి.. తిరిగి వెళ్లే వరకు కేటుగాళ్ల మనషులు ఏదో ఒకరకంగా ఫాలో అవుతూనే ఉంటారు. ఏ మాత్రం తేడా వచ్చినా ప్రాణాలు పోతాయంటూ బాధితులు చెబుతున్నారు. ఇప్పటికీ బెల్లంపల్లి, నెన్నెల మండలాల్లో పలువురి దగ్గర కేటుగాళ్ల నుంచి టస్టింగ్ కోసం తెచ్చుకున్న బంగారు గుండ్లు ఉన్నట్లు తెలుస్తున్నది.

**నమ్మి మోసపోవద్దు.. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం**

ఈ తరహా మోసాలపై ఇప్పటి వరకు మాకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. కర్ణాటక ప్రాంతానికి చెందిన ముఠాలు ఇలాంటి మోసాలు చేస్తుంటాయి. మోసపోయిన వారు ఎవరైనా సరే ధైర్యంగా వచ్చి ఫిర్యాదు ఇవ్వండి. మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఎంక్వైరీలు, కేసులు చేయాల్సి వస్తుందని భయపడొద్దు. ఇలా తెలియని వ్యక్తులను నమ్మి మోసపోవద్దు. అపరిచితులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

*- రవికుమార్, బెల్లంపల్లి ఏసీపీ*

# కేంద్రీయ విద్యాలయ పనులు వేగంగా పూర్తవ్వాలి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

హాజీపూర్, ఫిబ్రవరి 18 : గుడిపేటలో నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయాన్ని వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం గుడిపేటలో కొనసాగుతున్న కేంద్రీయ విద్యాలయ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం ద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్య అందిస్తారన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి కేంద్రీయ విద్యాలయాన్ని సిద్ధం చేయాలని గుత్తేదారులను ఆదేశించారు.

**ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు**

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 18 : ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 30 పడకల హాస్పిటల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. వార్డులు, ల్యాబ్‌లు, మందుల నిల్వలు, రిజిష్టర్లను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠశాల పరిసరాలు, రిజిష్టర్లను పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రిజిష్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

**పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి**

నస్పూర్, ఫిబ్రవరి 18 : మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, ఏసీపీ ప్రకాశ్, డీఈవో యాదయ్య, డీపీవో వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

# డేంజర్ జోన్‌లోకి పెద్దపులి

- వేటగాళ్ల ప్రాంతంలోకి అడుగుపెట్టిన టైగర్
- గతంలో ఉచ్చుకు బలైన పులి, రెండు ఎడ్లు
- విద్యుత్ తీగలకు తగిలి ఓ వేటగాడు సైతం మృత్యువాత
- ఆందోళనలో ఫారెస్ట్ అధికారులు

నెన్నెల, ఫిబ్రవరి 18 : నెల రోజుల పాటు బెల్లంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సంచరించిన పెద్దపులి ప్రస్తుతం నెన్నెల మండలంలోని అడవుల్లోకి అడుగు పెట్టింది. ప్రస్తుతం పొట్యాల, చిత్తపూర్ దుబ్బపల్లి ప్రాంతాల్లో అది సంచరిస్తుండగా, ఆ జోన్‌లో వేటగాళ్లు అడవి జంతువులను వేటాడుతుంటారు. రంగపేట సెంట్రల్ నర్సరీ నుంచి పొట్యాల అటవీ ప్రాంతాల్లో కొన్నేళ్లుగా పెద్ద పులులు సంచరిస్తూనే ఉన్నాయి. ఈ ప్రాంతంలో అడవి జంతువుల వేటగాళ్లు ఉన్నారు. కరెంట్ తీగలు ఏర్పాటు వేసి జంతువులను వేటాడుతుంటారు. ఇదే రంగపేట సమీపంలో మూడేళ్ల క్రితం ఓ పెద్దపులి వేటగాళ్ల ఉచ్చుకు బలైంది. అది చనిపోయిన విషయం రెండేళ్ల తర్వాత బయటపడడంతో వేటగాళ్లను పట్టుకొని జైలుకు పంపారు. ప్రస్తుతం పులి సంచరిస్తున్న అడవిలో గతేడాది వేటగాళ్లు అమర్చిన కరెంటు తీగలకు రెండు ఎడ్లు కూడా మృత్యువాత పడ్డాయి. దుబ్బపల్లిలో ఓ వేటగాడు కూడా తీగలు తాకి చనిపోయాడు. ఈ నేపథ్యంలో వేటగాళ్ల వల్ల పులికి ఎలాంటి హాని ఉంటుందోనన్న భయం నెలకొంది. నాలుగు రేంజ్‌ల అధికారులు, సిబ్బంది పులి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు.

పొట్యాల సమీపంలో పులి అడుగులను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

# తాగునీటి సమస్య లేకుండా చూడాలి

జైనూర్, ఫిబ్రవరి 18 : రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మంగళవారం జైనూర్ మండలం దుబ్బగూడ గ్రామ పంచాయతీలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా కార్యాచరణ రూపొందించి ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని, మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఇంటింటికీ నల్లా నీరందించాలని అధికారులను ఆదేశించారు. నీటి ట్యాంకులను శుభ్రం చేసి.. పైప్‌లైన్‌ల మరమ్మతులను వేగంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన నాణ్యత, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

దుబ్బగూడలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ